

# అగ్రహారం

వివినమూర్తి

"సారూ! మీ తమ్ముడంటన్నాడు. సూట్టానికి అట్టా లేడు," లీలా గార్డెనియాలో సెక్యూరిటీ ఆఫీసర్ ఫోను.

నరసింహశర్మ టీవీ నోరు మూసి ఇంటర్నల్ ఫోన్ కన్ను తెరిచాడు.

"చూపించు..." అచ్యుతం మీదకి కెమెరా ఫోకస్ చేశాడు. మాసిన గెడ్డం, బనీనులాంటి చొక్కా, చేతి సంచీ, హవాయి జోళ్లు, దళసరి కళ్లద్దాలు.

శర్మ నరనరమూ జల్లుమన్నాయి. మాట పెగల లేదు.

తమ్ముడు. రక్తం పంచుకు పుట్టిన తమ్ముడు. ఏలేటి ఒడ్డున ఇసుకలో ఇళ్లు కలిసి కట్టినవాడు. కొండ్ర కోటలో... తమ ఇంట్లో తులసికోట పక్కన వెన్నెట్లో అమ్మ కథలు వింటూ... గోరుముద్దలు తింటూ మనసుని పంచుకున్నవాడు.

అచ్యుతం... తమ్ముడూ... అచ్యుతశర్మా... ఇన్నేళ్ల తరువాత ఈ బెంగుళూరు మహానగరంలో... ఇక్కడ... ఇలా...

"సారూ! పంపించెయ్యమంటారా?" మర్యాదగా మెడపట్టి గెంటేస్తానంటున్నాడు రక్షణాధికారి.

"వెంటనే- ఇక్కడికి తీసుకురా!"

ఫోన్ ఆగింది. బొమ్మ మాయమయింది.

"మీనా మీనా," శర్మ కేకలకు పరిగెత్తుకొని వచ్చింది మీనా.

మీనా కాస్త ఒళ్లుగా ఉంటుంది. కావాలని ఒళ్లు చూపిస్తున్నట్టు ఉంటుంది. అదొక్కటి వదిలేస్తే అన్నివిధాలా అనుకూలమైన పనిమనిషి. ఏ సమయా నికి ఏం కావాలో తెలుసు. ఒకమారు చెపితే మళ్లీ చెప్ప క్కరలేదు. రుచులు గుర్తుంచుకుంటుంది. కన్నడందైనా తెలుగు వంటలు పట్టేసింది. అమ్మక్కగా చేసి వడ్డించి తినిపిస్తుంది.

స్నానం చేస్తూ చేస్తూ వచ్చినట్టుంది. తువ్వాలు చుట్టుకొని వచ్చింది.

"ఏం సారూ!"

ఓ నిమిషం అలా ఉండిపోయాడు.

"చెప్పండి సారూ!"

కళ్లు తిప్పుకున్నాడు. ఎప్పుడో అప్పుడు ఇది నన్ను చంపేస్తుంది.

"తొందరగా బట్టలు వేసుకురా! నన్ను బయటకు తీసుకెళ్లాలి."

"ఇప్పుడా?" ఆశ్చర్యంగా అంది.

"ఇప్పుడు తీసుకెళ్లకూడదని ఏజెన్సీ వాళ్లు రూలు పెట్టారా?" కోపంగా అన్నాడు.

పనిమనుషులను సప్లెయ్ చేసే ఏజెన్సీ మీనాని పంపింది. నప్పకపోతే మార్చెయ్యమనొచ్చు. డబ్బు పడేసాక వీళ్లు చెయ్యక చస్తారా? వాళ్లు పంపక చస్తారా?

"అవు సారూ! పెట్టిన్రు," అంటూ పకపకా నవ్వుతూ లోపలికి వెళ్లింది. శర్మకి కోపం పెరిగేదే- తమ్ముడు వస్తున్నాడన్న ఎమోషన్... కిందకి వెళ్లి తనే ఆహ్వానిద్దామన్న ఎమోషన్... కదలలేని అశక్తత... అశక్త దౌర్జన్యం...

క్షణంలో నైటీ తగిలించుకుని వచ్చింది. వస్తూ చక్రాలకుర్చీ తీసుకుని వచ్చింది. నోటిలోమాట నోటిలో ఉండగా చేసేస్తుంది మీనా. కుర్చీలో కూర్చోబెట్టింది.

వరండాలోకి వచ్చి, లిఫ్ట్ చేరుకునేసరికి లిఫ్ట్ ఆగింది. సెక్యూరిటీ గార్డు, అచ్యుతశర్మ బయటకు వచ్చారు. ''నమస్తే సాబ్,'' అన్నాడు గార్డు.

అచ్యుతం చెయ్యి పట్టుకుని అలాగే ఉండిపోయాడు శర్మ. ఇద్దరి చూపులూ పెనవేసుకున్నాయి. శరీరాలలో ఉద్విగ్నత. క్షణకాలంలో వెళ్లిపోయిన కాలమంతా ఒడిసి పట్టుకోవాలన్న తపన.

''దా,'' అని అపార్ట్‌మెంట్ వేపు కదిలాడు.

''మీనా... వీడు అచ్యుతం... నా తమ్ముడు,'' అన్నాడు పరిచయం చేస్తున్నట్టు. రెండేళ్లుగా ఈ కొంపలో ఉంటున్నాను. ఎన్నడూ రాని ఈ తమ్ముడు ఎక్కడ నుంచి ఊడిపడ్డాడు?- ఆపాదమస్తకమూ పరిశీలించింది మీనా.

భ్రమలోంచి బయటపడుతున్నట్టు, ''నీ కాళ్లకి ఏమయింది?'' అడిగాడు అచ్యుతం.

బాత్రూంలో జారిపడ్డాడు- అందామనుకుంది మీనా.

''ప్రారబ్ధ కర్మ!'' అన్నాడు శర్మ.

''గతం గతః మరచిపో,'' అన్నాడు అచ్యుతం.

తను పశ్చాత్తాపపడుతున్నట్లు అచ్యుతం అర్థం తీసుకున్నాడా? అది తప్పని చెప్పాలా? ప్రారబ్ధకర్మ అన్నది ఒక పదంగా అప్రయత్నంగా వాడాడే తప్ప ఇప్పటికీ ఆ పదం వ్యక్తం చేసే భావన మీద నమ్మకం లేదని వివరించాలా? ఎందుకు? ఏం సాధించటం కోసం?

''నన్ను నువ్వు గుర్తుపట్టావు. ఆశ్చర్యంగా ఉంది అన్నయ్యా!''

''రక్తం పంచుకుపుట్టిన తమ్ముడివి. ఆశ్చర్యం దేనికి?''

''దేనికా!? ఒకటా రెండా నలభై రెండేళ్లయింది నన్ను చూసి.''

''అవును,'' శర్మ గొంతు కొర్రబోయింది.

అన్న భుజం మీద చెయ్యివేసి అదిమాడు తమ్ముడు.

శర్మ సర్దుకుని నవ్వాడు. ''మధ్యమధ్యలో ఫోనులో మాట్లాడుకుంటూనే ఉన్నాం గదా- సుబ్బు అమెరికాలో మీ అందరి ఫోటోలూ చూపిస్తూనే ఉన్నాడు.''

''అంతా నీ చలవ. వాడు ఈ మాత్రమయినా ప్రయోజకుడయాడు. కనీసం వాడి బ్రతుకు వాడు బ్రతుకుతున్నాడు.

''ఏదో జరిగింది. ఏంటది?'' అన్నాడు శర్మ.

అచ్యుతం తలొంచుకుని కొంతసేపు మాట్లాడలేదు. తర్వాత తల ఎత్తి బలహీనంగా నవ్వుతూ, ''ఎలాగూ వచ్చాను గదా, అన్నీ చెపుతాను. తొందర ఏముంది?'' అన్నాడు.

ఆ గొంతులో, నవ్వులో... ఉన్నది ఏమిటో- అది లౌక్యమో, దుఃఖమో పోల్చుకోలేక పోతున్నాడు నరసింహశర్మ. పద్దెనిమిదేళ్ల తమ్ముడిని అరవై ఏళ్ల ఈ ఆకారంలో వెదుక్కుంటున్నాడు. ఏ ఒక్కటీ సూటిగా మాట్లాడని తమ కుటుంబాలను గుర్తు చేసుకుంటున్నాడు.

మంచినీళ్ల గ్లాసుని ట్రేలో పెట్టి తీసుకు వచ్చింది మీనా.

దాన్ని తీసుకుని చేతికి అందివ్వటం వచ్చిన అతిథి ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ఒక్క సెకను ఆ పని చేయబోయి, తీసుకుంటావా అని అడగబోయి తమాయించుకున్నాడు శర్మ. నీళ్లగ్లాసునీ, మీనానీ పరిశీలిస్తున్న అచ్యుతం గ్లాసు తీసుకుని తల ఎత్తి గొంతులో ఒంపుకున్నాడు.

అతనలా చేస్తున్నపుడు తల నుంచి వేలాడుతున్న శిఖిని వింతగా చూస్తోంది మీనా. అది చూచి శర్మ ఇబ్బందిగా కదిలాడు.

''పాలు తీసుకురా!'' అన్నాడు

''టీ,'' అన్నాడు అచ్యుతం.

మీనా లోపలికి వెళ్లిపోయింది.

''ఆవిడ పోయిందని చాలా ఆలస్యంగా తెలిసింది. వద్దామనుకున్నాను. నాన్నగారు...''

''ఆయనెందుకులే కష్టపెట్టడం? మీ 'వదిన' 'మీ' బ్రాహ్మణ్యంలో ఎవ్వరికీ తీసుకుపోదు... నన్నలా చూసుకుంది ఉన్నన్నాళ్లూ. సరే, నన్ను చూసింది అందులో గొప్పేం లేదు. నీకూ నీ కొడుకులకూ, రాజీ పిల్లలకూ అంతో ఇంతో చేయగలిగానంటే కారణం 'ఆవిడే...'' వదిన, ఆవిడే అన్న పదాలను ఒత్తుతూ అన్నాడు.

అచ్యుతం మాట్లాడలేదు. 'వదిన' అన్న పదం గొంతు నుంచి ఊడిపడలేదు. అందుకు అన్నయ్య కష్టపెట్టుకున్నాడని అర్థమవుతోంది. ఇంత కష్టపెట్టుకుంటాడని అనుకోలేకపోయాడు.

''అన్నయ్యా, కుంద్రాడూ... కుంద్రదీ ఎలా వున్నారు...''

"వసీం పెళ్లి చేసుకున్నాడు. చైనీస్ అమ్మాయి. ఇద్దరూ జర్మనీలో ప్రొఫెసర్లు. గుండెలో చిల్లు ఉన్న ఇద్దరు ఆఫ్రికన్ పిల్లలని దత్తు తీసుకున్నాడు. ప్రతిరోజూ కాంటాక్ట్‌లో ఉంటాడు... ఇంక కౌసల్య..."

"అమ్మ పేరు పెట్టావా...?"

"నేను పెట్టలేదు. 'ఆవిడే' పెట్టింది..."

"నిన్ను బాధపెట్టాలని అనలేదు అన్నయ్యా."

"తెలుసు. చిన్నచిన్న మార్పులు కూడా చేసుకోలేకపోవటం మన సంస్కృతి ఔన్నత్యం..."

టీ తీసుకువచ్చింది మీనా.

"మీకు లెమన్ టీ సారూ! కావాలంటే ఒక్క క్యూబ్ సక్కర..." అంటూ ట్రేలో టీ కప్పులూ, మరో కప్పులో సుగర్ క్యూబ్స్, చెంచాలూ అక్కడ టీపాయ్ మీద ఉంచింది.

"పంచదార కలిపుండదు. కావాలంటే వేసుకో..." అన్నాడు శర్మ తాగుతూ...

"కౌసల్య ఎక్కడుంది... పెళ్లయిందా?"

"సుబ్బు మా కబుర్లు చెప్పడా...?"

"వాళ్లమ్మతో చెపుతాడు. కౌస్... కౌస్... అంటుంటే విన్నాను. ఏదో చెప్పాడు నేను నమ్మలేదనుకో."

"వాడు చెప్పింది నిజమే. సీతారామయ్య అన్న కుర్రాడితో కలిసి బ్రతుకుతోంది. ఓ కొడుకు. తాత పేరు జలాలుద్దీన్ అంటుంది. ఆ సీతారామయ్య కొన్నాళ్లు సుబ్బుకి బాస్..."

తమ్ముడి మొహంలోకి చూశాడు శర్మ పరిశీలనగా.

ఇంత భ్రష్టుడి ఇంటికి ఎందుకు వచ్చానా అని బాధపడుతున్నాడు కామోలు. అలా పడాలని తను కోరుకుంటున్నాడా? ఆ బాధని అచ్యుతం మొహంలో వెదుక్కుంటున్నాడా? కొన్ని నిముషాల ముందు తనలో పోటెత్తిన ఉద్వేగాలూ స్పందనలూ ఇంతలోనే ఛిద్రమయాయా? నలభై రెండేళ్ల కాలం వాడిని మార్చకుండా ఉంటుందా? టీ తాగుతున్నాడు గదా! తను? తను మారాడా?

అచ్యుతం అన్న చూపులో చూపు కలపలేదు.

తమ పిల్లల గురించి చెప్పినవేవీ అచ్యుతాన్ని విభ్రాంతికి గురి చేయలేదని అర్థమయింది శర్మకి.

''స్నానం చెయ్యాలన్నయ్యా,'' అన్నాడు అచ్యుతం.

"మీనా!"

వచ్చింది. గది చూపించమన్నాడు. తువ్వాళ్లు, దుప్పట్లు, సబ్బు, షాంపు, రేజరు, గుర్తుకొచ్చినవన్నీ మీనా ముందు చదివాడు. చదవనవసరం లేదు. మీనాకి అన్నీ తెలుసు.

''ఏం కావాలన్నా మీనాని అడుగు. తెలుగు తెలుస్తుంది.''

## 2

సాయంత్రం అన్నను కుర్చీలో కూర్చోబెట్టుకుని బయటకు తీసుకువెళ్లాడు. విశాలమైన సిమెంటు రోడ్లు. రోడ్డుకి అటూ ఇటూ పెంచిన పొదల చెట్లు.

వెళుతుంటే కొందరు పలకరిస్తున్నారు. అచ్యుతంకి అర్థంకాని అనేక భాషలు. జుత్తుకి వయసుని దాచుతున్న రంగులు. తెల్లటి ఫ్రెంచ్ గడ్డాలు, గుళ్లు, టోపీలు, బొమ్మల చొక్కాలు, మీసంలేని గెడ్డాలు, బర్ముడాలు, తెల్లటి పైజామా, చొక్కాలు, పంచెలు... కళ్లీ లాల్చీలు.

స్విమ్మింగ్ పూల్ దగ్గర కూర్చున్నారు.

ఎంత చెప్పినా అచ్యుతం బనీను పంచె మార్చుకోలేదు. గడ్డం గీసుకున్నాడు. మీనా వండింది వడ్డిస్తే... తిన్నాడు. ఎందరెందరో చుట్టాల గురించి అడుగుతున్నాడు అన్న. చెపుతున్నాడు శర్మ. కాంద్రకోట గురించి... ఏలేటి గురించి... ఏలేటి ఇసక గురించి... పంటల గురించి... కాంద్రకోట నూకాలమ్మ గురించి... గైరమ్మ సంబరాల గురించి... రాంకోవెల చెక్క భజనల గురించి... ప్రశ్నల ప్రవాహం.

"నువ్వు ఏదీ మర్చిపోలేదన్నయ్యా. ఇందులో అనేకం నేనే మరిచిపోయాను..." అన్నాడు అచ్యుతం.

అచ్యుతం మాటల్లో పడుతున్నాడు. వాళ్లిద్దరి తండ్రి ఏం మాట్లాడినా... లోకం చెడిపోవటం చుట్టూ తిరిగేది. అచ్యుతం మాట్లాడుతున్నదంతా... గడవటం... బ్రతకటం... చుట్టూ తిరుగుతోంది. ఆ మార్పు నరసింహశర్మకి అర్థమవుతోంది. అతని మాటలన్నీ గతం చుట్టూ... గత దినాల రమ్యత చుట్టూ తిరుగుతున్నాయి. ఆ విషయం అచ్యుతం గుర్తించలేదు.

"పౌరోహిత్యం బానే కిట్టుబాటవుతోందట. వాళ్లూ వీళ్లూ అని లేదు- ఎవరు పిలిచినా వెళతాం, ఏం అడిగితే అది చేస్తున్నాం. ఏం లాభం, ఏదీ నిలవటం లేదు. బ్రాహ్మణ్యం మొత్తం చెడిపోయింది. తాగుడు కూడా మొదలెట్టేశారు. మునుపూ ఉండేదనుకో. బయట పడకూడదనుకునేవారు. గర్భగుడిలోని ఓ పిల్ల చెయ్యి పట్టుకున్నాడు త్రాష్టుడు. అయినా జనానికి విలువ

ఉంది. నిష్టగా ఉన్నవాళ్లకి గౌరవం చూపిస్తారు. ఏ మాట కామాట ఒప్పుకోవాలి. విలవంటే... డబ్బు...''

తమ్ముడి మాటలకు అడ్డుబడుతూ అన్నాడు శర్మ.

''నేనిప్పుడు కాంద్రకోట రావచ్చా?''

అచ్యుతం మాట ఆగిపోయింది.

రెట్టించలేదు శర్మ. అనవసరంగా వాడి ఉత్సాహాన్ని పాడుచేసానని శర్మ మనసులో అనుకున్నాడు.

చలిగాలి మొదలయింది. స్విమ్మింగ్‌పూల్‌లో ఆడవాళ్లు, పిల్లలు ఉన్నవైపు వుంది శర్మ చక్రాల కుర్చీ. అచ్యుతం చూపులు అన్న మీదా, అన్న చూపులు స్విమ్మింగ్‌పూల్ మీదా ఉన్నాయి.

''పోదామా అన్నయ్యా...'' అన్నాడు.

''పద!''

''నీక్కోపం వచ్చిందా అచ్యుతం?'' అన్నాడు లిఫ్ట్‌లో.

''ఎందుకూ?'' ఆశ్చర్యంగా ధ్వనించింది తమ్ముని గొంతు.

''కాంద్రకోట రావచ్చా, అని అడిగాను గదా.''

''అవును! కోపం రాదా?''

''నాన్నగారు పోయారని... అడిగాను...''

''ఆయన ఉండగా నువ్వొస్తే... ఎవరయినా అడ్డగలరా...?''

ఆశ్చర్యంగా చూసాడు తమ్ముడిని.

లిఫ్ట్‌లోంచి బయటికి వచ్చి పిలుపు గంట మోగించాడు శర్మ.

మీనా వచ్చి తలుపు తీసింది. అంత ఒళ్లు మీద వేసుకున్న మిడ్డీ చొక్కాలు కొట్టచ్చినట్టు కనిపిస్తున్నాయి. మొహానికి పౌడరు ఎక్కువయింది.

'సందేహం లేదు. ఇది ఎప్పుడో అప్పుడు నన్నిలాగే చంపేస్తుంది. ఉన్నవన్నీ చక్కబెట్టేస్తుంది. ఇది హత్య అని లోకానికి తెలియదు,' అనుకున్నాడు శర్మ, పాత ఉద్వేగాల మీద దాడి చేస్తున్న వర్తమాన ఉద్వేగాలతో.

టీవీ వాగుతోంది. ఛానళ్లు మారుతున్నాయి. అన్నదమ్ములు ఇద్దరూ మౌనంగా సోఫాలో  కూర్చుని ఉన్నారు.

''చూశావా దీని వ్యవహారం,'' అన్నాడు శర్మ అసందర్భంగా.

''ఎవరు?''

''మీనా...? పనిమనిషి.''

''వదినపోయి... ఎన్నాళ్లయింది?''

చటుక్కున తమ్ముడి మొహంలోకి చూశాడు. అతని చెయ్యి పట్టుకుని బలంగా అదిమాడు. అన్న కళ్లలో భావాలు అచ్యుతానికి అందాయి.

''మూడేళ్లు... మూడు యుగాలు... మిమ్మల్నందర్నీ గుర్తుచేస్తూనే... మీరు చుట్టూ ఉన్నట్టు భ్రమింపజేస్తూనే... అచ్యుతం... అచ్యుతం... మీ వదిన... నా యాస్మిన్... మనిషి కాదు దేవత... తను చేసిన తప్పు ఏదైనా ఉందంటే- నన్ను ఇలా వదిలేసి... తను ముందు వెళ్లిపోవటం...''

అన్ని గాంభీర్యాలూ బిడియాలూ విడిచి అన్న బావురుమంటుంటే అచ్యుతం దగ్గరకు తీసుకున్నాడు.

వదిన అన్న ఒక్క పదం తమ్ముడి నోటమ్మట వినగానే ఎన్నో... ఎన్నెన్నో... గోడలు కూలిపోయినట్లుంది అన్నకి.

రాత్రి భోజనాలు ముగిసాయి.

ఇద్దరికీ ఒక గదిలోనే పక్కలు ఏర్పాటు చేయమనడంతో మీనా కాస్తంత ఆశ్చర్యంగా శర్మని చూసింది. పిల్లలు వచ్చినా ఎవరూ ఆయన గదిలో ఎన్నడూ పడుకోలేదు.

పడుకున్నారు. కబుర్లు మొదలయినాయి.

''ఒక్కమాట అడుగుతాను. నిజం చెప్పాలి...''

''అడుగు... తెలిస్తే తప్పక చెబుతాను...''

''నిజంగా నేను వస్తే... నాన్నగారు ఏమీ అనేవారు కాదా?''

''తెలీదు... కాని ఒక్క ముక్క ఖచ్చితంగా చెప్పగలను...''

ఏంటన్నట్టు చూసాడు శర్మ.

''నువ్వు వెళ్లిపోయినప్పటి ఊరుగాదు ఇప్పుడున్నది... 'ఇలా ఉండకూడదు... అలా చెయ్యకూడదు,' అని ఎవరికి వాళ్లు అనుకోవచ్చు. ఉండకపోతే ఒకరినొకరు ఇంకా వేళాకోళం చెయ్యవచ్చు. కాని... ఒకరిని ఒకరు ఏమీ చెయ్యలేరు. నిప్పుపుట్టక... నీళ్లు తోడుకోనివ్వక... వెలివేయబడ్డ వాళ్లు ఊళ్లొదిలి వెళ్లిపోయిన రోజులన్నీ పాతవి. నువ్వు వదినని చేసుకుని వెళ్లిపోయేనాటికే అలాంటివన్నీ వెనకబట్టాయి. మనిషిని కఠినాత్ముడిని చేసేవి విశ్వాసాల కన్నా సాంఘిక భయాలు. నాన్నగారి మనసులో ఉన్నది వేరే భయం. నిన్ను రమ్మంటే నువ్వు సంపాదించుకున్న డబ్బుని చూసి రమ్మంటున్నాడని... నువ్వు అనుకుంటావేమో

నన్న భయం... నాన్నగారి మనసులో ఉంది. అది యదార్థం. అది నాకు ఖచ్చితంగా తెలుసు."

"ఏంటన్నావ్... ఏంటంటున్నావ్... ఏంటంటు న్నావ్..." అంటూ వణుకుతున్న గొంతులో లేచి కూర్చున్నాడు నరసింహశర్మ. మనిషి వణికిపోతున్నాడు.

అన్నకి మంచినీళ్లు ఇచ్చి గుండెల మీద రాశాడు అచ్యుతం.

అతను చేతులు పట్టుకొని కాస్త తేరుకొన్నాక, "ఈ విషయం నాకు ఎందుకు చెప్పలేదురా తమ్ముడూ..." గొంతుని స్వాధీనపరుచుకుంటూ అన్నాడు.

కొంతసేపటికి శర్మ కోలుకున్నాడు.

"నువ్వేం అనుకోనంటే..."

"చెప్పు."

"కొంచెం బ్రాందీ తీసుకుంటాను..." బ్రాందీ అంటేనే అర్థమవుతుందన్న గొంతుతో అన్నాడు.

"నీ ఇష్టం..." అన్నాడు తమ్ముడు.

"మీనాని పిలుస్తాను," బజర్ నొక్కబోయాడు.

"తప్పదంటే పిలువ్! కావాలంటే నేనే తెస్తాను," అన్నాడు.

గదిలోనే ఉన్న మినీబార్‌లోంచి స్కాచ్, సోడా తెప్పించుకున్నాడు. "నువ్వు?" అన్నాడు సంకోచిస్తూ. అచ్యుతం నవ్వాడు వద్దన్నట్టు. "అన్నయ్య ముందనా?" మళ్లీ అచ్యుతానిది అదే నవ్వు.

ఒక లార్జ్ వేసుకుని సోడా నింపి సగం గ్లాసు ఖాళీ చేసాడు. డ్రైనట్స్ నములుతూ అన్నాడు.

"నాకెందుకు తట్టలేదురా... నేనెందుకు ధైర్యం చెయ్యలేదురా... అనేకసార్లు వదిన బలవంతం చేసింది. మనమే వెళ్దాం అనేది. పొమ్మంటే వచ్చేద్దాం అనేది. పోనీ నువ్వయినా వెళ్లు అని కూడా అనేది. నేనేమనేవాడినో తెలుసా అచ్యుతం..."

*

"మతాలు మారవు. అదే వాటి విశిష్టత."

"మారటం మానవ నైజం. మతాలు అడ్డుపడ తాయి. అది మానవుని విశిష్టత. ఇది గుంపుల నిర్మాణం లోని ఆవశ్యకత..."

"మానవుడు కీలుబొమ్మ..."

"నువ్వూ... నేనూ... కీలుబొమ్మలమా సింహం!"

"కాక...? మనం మతాలు మార్చుకున్నామా... వదులుకున్నామా...?"

"మార్చుకోవాలనీ వదులుకోవాలనీ అనిపించ లేదురా... అనిపించటం లేదురా..."

"ఎందుకని..." శర్మ.

"... ..."

"నీ దగ్గరే కాదు... నా దగ్గర కూడా సమాధానం లేదు. మతం తను లేకుండా మనిషిని ఊపిరాడకుండా చేసేసింది. అయితే..."

"ఆగావేం... చెప్పు..."

"ఫీలవుతావు..."

"నేను నీ అంత ఇల్లాజికల్ కాదులే..."

"నేను కాదన్న భావం తప్పించి నువ్వు అవునన్న ధ్వని అందులో లేదు మాస్టారూ..."

"వేళాకోళాలు వదిలేసి... నువ్వు ఫీలవనంటే చెపు తాను..."

"పేపరూ... పెన్నూ తీసుకురా... స్టాంప్ పేపర యినా ఫరవాలేదు. సంతకం పెడతాను. ఆ తర్వాత నీక్కావలసింది రాసుకో..."

"నీ మతం ఎలా మారదో... యాస్మిన్... నా మతమూ అంతే... అలాగే మారదు. మారేటట్టయితే ఇంత టెర్రరిజం ఉండదు. ఇంత టెర్రరిజం ఉన్నట్ట యితే ఇతర మతాలు మారవు... అవీ అలాగే బిగుసుకు పోతాయి..."

"... ..."

"ఫీలవనన్నావు. ఫీలవుతున్నావు. ఇది సున్నిత మైన విషయం. అందుకే... నిజం చెప్పటానికి అంత సంకోచించాను..."

"ఫీలవటం లేదని అనను. ఫీలవుతున్నాను..."

"అయామ్ ఎక్స్ట్రీమ్లీ సారీ... నీ మతాన్ని గురించి... కేవలం... ఒకే ఒక అబ్జర్వేషన్... అంతే... అగౌరవం కాదు... నన్ను అర్థం చేసుకో... నాకు దూరం అవకు..."

"నేను ఫీలవుతున్నది నువ్వు అనుకుంటున్నట్టు... మతాల గురించి కాదు... మనుష్యుల గురించి..."

"అర్థమవటం లేదు..."

"చెపుతాను, విను. ఆలోచించు. టెర్రరిజం మతం మారకపోవటానికి గుర్తు. ఒక మతం టెర్రరి జానికి ఆయువుపట్టయితే మిగిలిన మతాలు ఊరు కోవు... అవీ టెర్రరిజం చేపడతాయి. ఇదీ నీ దృష్టి..."

"నా దృష్టి కాదిది."

"కాదనే అనుకుందాం. నువ్వన్నది అదేగదా..."

"మార్పు విషయంలో... అన్నమాట అది."

"అన్నావు గదా- టెర్రరిజానికి ఓ మతం కారణం అవునో కాదో తరువాత ఆలోచిద్దాం. మార్పు విషయమే

మాట్లాడుకుందాం. ఏ ఒక మతమయినా అది పుట్టి నపుడు ఎలా ఉందో- ఇప్పుడు కూడా అలాగే ఉందా- ఆలోచించి చెప్పు.''

''... ...''

''ఆ మార్పుల వేగంలో తేడాలు ఉండవచ్చు. లోతుగా పరిశీలిస్తే... కాలంలో ముందు పుట్టిన మతా లలో మార్పులు సాపేక్షంగా కాస్తంత వేగవంతం అవటం గమనించవచ్చు. నా పరిశీలన ప్రకారం మనిషి మారతాడు. అతని మార్పులని అంగీకరించటం గుంపుకి తప్పనిసరి అవుతుంది. ఆ తప్పనిసరితనం లోంచే మతాలు పుట్టాయి. మతాలు మారాయి. మార బోతాయి. మారతాయి. ఇది మనం సులువుగానే గ్రహించవచ్చు. మానవుని అనుసరించి మారక తప్పని మతాల సహజగతిని వక్రీకరించి, మతాలచేత బంధింప బడే మానవుని కీలుబొమ్మను... మానవుడిగా వేదిక మీదకి తీసుకురావలసిన అగత్యం ఎవరికి ఉంది...?''

''... ...''

''సంపదను అధికారంగా, అధికారాన్ని సంపదగా తర్జుమా చేస్తూ... దేన్నీ చెయ్యి దాటిపోకుండా చేసుకోవ టానికి ప్రపంచాన్ని ఏలేవారూ, ఏలాలనుకునేవారూ ఎన్నింటిని ఉపయోగించుకోటంలేదూ... ఎన్ని రకా లుగా మానవులను చీల్చలేదూ. ఈనాడు అంతిమ యుద్ధం రెండు మతాల మధ్యేనని ధ్వనిస్తున్న వాళ్లు వాటికి ముసుగు కప్పి రెండు సంస్కృ తులుగా, రెండు నాగరికతలుగా చెప్పి సిద్ధాంతాలు చేస్తూ హోరెత్తిస్తున్న వాళ్లు, మానవుని సహజ గమనానికి ఎన్ని అడ్డంకులు కల్పించటం లేదూ... మానవునిలోని సహజ అనురాగా లను, ఆవేశాలను వారి అవసరాల మేరకు నియంత్రిం చటం లేదూ. తండ్రి దినం పెట్టు, అమ్మ దినం పెట్టు, ఆడదాని దినం పెట్టు, మాతృభాషా దినం పెట్టు అనటం లేదూ. సంస్కృతిలోని జీవాన్ని చంపేసి చేట పెయ్యగా మార్చి ఆ బొమ్మకు పూజలు చేయించి మనలను ఎన్ని ముక్కలుగా ఉంచటం లేదూ...''

''యాస్మిన్...''

''నేనెందుకు ఫీలవుతున్నానంటే ఒక తోటి ప్రాణిగా... నీ ప్రియురాలిగా... ఎలాగయితేనేం నేనెక్కడ నొచ్చుకుంటానో అని ఎంతో సున్నితంగా వ్యవహరిం చావు నువ్వు. ఆ కోమలత్వం సహజగుణం అంటాను. అది ఎంతగా భవిష్యత్తు మీద ఆశ కలిగిస్తుందో. అలాంటి నిన్నూ, నీ కోమలత్వాన్నీ, ఆలోచనాతత్వాన్నీ... చివరకు నీ ప్రేమనీ అడ్డుకోగలిగిన నేటి ఏలికలు సృష్టిం చిన అదృశ్య శృంఖలాల బలం గమనిస్తే నిరాశ... భయం... అందుకు నేను ఫీలవుతున్నాను సింహం...!''

''నువ్వంటున్నది...''

''ఆలోచించు. అర్థం కాకుండా పోదు.''

''ఏమో!...''

''ఇంక టెర్రరిజం... మతం... సాధనాలేగాని కారణాలు కావు. అది నా నిశ్చితాభిప్రాయం. వ్యాపారం రాజకీయ చొక్కా తొడుక్కుని మతాల మధ్య ద్వేషం రగిలించి ఊరు బయట జనం కొట్టుకు చావటానికి ఏర్పాట్లుచేసి వాళ్లా పనిలో ఉండగా ఊళ్లో ఇల్లు చక్క బెడుతుంది. కడుపు నిండని వాళ్లు ఉన్నంతకాలం రాజ్యానికి సైనికులు దొరుకుతారు. టెర్రరిజానికి టెర్రరిస్టులు దొరుకుతారు. ఆయుధాలు చేయటానికి కార్మికులు దొరుకుతారు. కడుపు నిండినా అహం నిండనివాళ్లు ఉన్నంతకాలం ఆయుధాలతయారీకి శాస్త్రజ్ఞులు దొరుకుతారు. రాజకీయ క్రీడకు నాయ కులూ కార్యకర్తలూ దొరుకుతారు. మానవునిలోని దైహిక మానసిక అవసరాలనూ... స్వార్థ త్యాగాలనూ... తమ చేతుల్లో ఆడించేందుకు రకరకాల భక్తులు ఉన్నారు. దేశభక్తి, జాతిభక్తి, భాష భక్తి, మత భక్తి, ప్రాంత భక్తి, కులభక్తి... ఒకటేమిటి కోకొల్లలు...''

''యాస్మిన్...''

''ఫరవాలేదు సింహం... మానవుడు దెబ్బతింటా డేమోగాని నాశనం కాడు. ఎందుకంటే మానవుడు మార గలడు. ఎంత గతి తప్పించినా... మానవుని వివేచన... చంపివేయబడదు. దాన్ని గుర్తు పట్టగిలిగితేనే ఆశ... భవిష్యత్తు మీద అంతులేనంత ఆశ... ఆశ... ఆశ...

*

మీ వదిన చెప్పినవన్నీ వినేవాడిని. ఆలోచించే వాడిని. నాన్నగారు మారవచ్చునన్న ఆలోచన ఓ మెరుపులా కలిగేది. మారారో లేదో వెళ్లి ఎదుటబడితేనే కదా తెలుస్తుంది అని అనిపించేది.

శర్మ మాటలు ఆగిపోయాయి. మూడో పెగ్గు వేసుకున్నాడు.

ఎంతకీ మాట్లాడకపోవటంతో అచ్యుతం అడి గాడు. ''పోనీ... వదిన అంతలా చెప్పినపుడయినా మన ఊరు రాలేకపోయావా అన్నయ్యా?''

శర్మ బాగా పుక్కిలించి మింగాడు. కళ్లు పెద్దవయాయి. ఒక దుఃఖం, ఒక నవ్వు కలగలిసాయి.

''రాలేదురా... రాలేకపోయాను...'' అంటూ ఒక్కమారు గొంతులో ఒంపేసుకున్నాడు. ఒక వెర్రి నవ్వు, వణుకు.

''నేను నాస్తికుడిని... మతం మత్తుమందని నమ్మినవాడిని... కాని... యాస్మిన్ నాలాగే ఆలోచనాపరురాలు. నాకన్నా సహనమూర్తి... అయినా ఆమె... ఆడది, ముస్లిం. తను చేయగలిగింది చేసింది. నేను చేయవలసింది... మతం...''

అచ్యుతానికి అన్నయ్య అర్థం కాలేదు. ఆ ఆలోచనాపరుల సమస్య అర్థం కాలేదు. అన్నయ్యని మంచం మీద పడుకోబెడుతూ, 'ఒకప్పుడు అన్నయ్య ఎంత దృఢంగా ఉండే వాడు?' అనుకున్నాడు.

## 3

మూడు రోజులు గడిచాయి.

ఎందుకు వచ్చిందీ అచ్యుతం చెప్పలేదు. సుబ్బు పట్టించుకోవటం లేదని సూచనప్రాయంగా అర్థమవుతోంది. శర్మ అడిగినపుడల్లా అచ్యుతం మాట మార్చేవాడు.

శర్మ మాత్రం తన కష్టాలు ఏకరువు పెట్టేవాడు.

అతని కష్టాలన్నింటికీ కేంద్రబిందువు డబ్బుకి తగ్గ సేవ లభించకపోవటం. పనివాళ్లు, వాళ్లని సప్లయ్ చేసే వాళ్లు, ఈ గార్డేనియా నిర్వాహక ఉద్యోగులు, సెక్యూరిటీ వాళ్లు- ప్రతివాడూ నీచుడే. డబ్బు ఎంత పారేసినా ధర్మంలేదు. న్యాయంలేదు. నీతిలేదు. 'సేవ'లో అందరూ దొంగలే. అమెరికాలో ఉన్న ప్రొఫెషనలిజమ్ అయినా లేదు.

పిల్లలు దూరంగా ఉండటం, భార్య పోవడం, ముసలితనంలో ఒంటరితనం అచ్యుతానికి అర్థమయే కష్టాలు. అవి కష్టాలే కాదన్నట్లు ఉండేది శర్మ తీరు. నెట్లో... ఫోన్లలో... చూసుకుంటున్నారు, మాట్లాడుకుంటున్నారు. అపుడపుడు వస్తున్నారు, పోతున్నారు. ఇంతకన్నా పిల్లలు ఏం చెయ్యగలరు? అన్న ప్రశ్నే సమాధానంగా వినిపించేది.

ఆ ప్రదేశాన్నంతటినీ మూడురోజులు తిరిగితిరిగి చూశాడు అచ్యుతం. చుట్టూ మూడువైపుల ఎత్తైన గోడలు, ఎందువల్లో వెనకవైపు గోడలకి బదులు ఎత్తైన తీగల కంచె. దానిలో నుంచి బయట ప్రపంచం కనిపిస్తోంది. అది ఒక పల్లెటూరు. చిన్నచిన్న ఇళ్లు. చెరువు. చెరువు గట్టు మీద నుంచి నడిచిపోయే మనుషులు, ఆ దరినే పిల్లలు. ఆ ఊరంతటినీ కొనేసి ఈ గార్డెనియాని పెంచాలని ఆలోచన ఉందిట. అక్కడ పని చేస్తున్న కాపలావాళ్లు చెప్పారు. వాళ్లను కూడా గుర్తింపు కార్డు ఉంటే తప్ప లోనికి వదలరాదన్నంత క్రమశిక్షణతో పనిచేస్తున్నారు. అందులో చాలామంది అనంతపురం, హిందూపురం, చిత్తూరు ప్రాంతాల నుంచి వచ్చిన భూములు పొమ్మన్న రైతులు- పంచెలు చొక్కాలు విడిచి యూనిఫారాలు కట్టినవాళ్లు. చేతికర్రలు విడిచి లాఠీలు పట్టినవాళ్లు. వాళ్ల బిడ్డలు డ్రైవర్లుగారి భార్యలు పనిమనుషులుగా- ఆ మహానగరానికి 'సేవలు' అందించే సంస్థలలో ఉద్యోగులు.

''అన్నయ్యా- ఈ ప్రదేశం ఇక్కడ ఇదంతా చూస్తుంటే విచిత్రంగా ఉంది,'' అన్నాడు ఈతకొలను దగ్గర కూర్చున్నపుడు.

''అగ్రహారంలా ఉందా?''

''అగ్రహారమా?''

''ఇక్కడ వేదఘోషలు లేవు. నిత్యాగ్నిహోత్రాలు లేవు. అంత పవిత్రులు కూడా లేరు. కానీ... మీ వదిన ఈ గేటెడ్ కమ్యూనిటీలని అగ్రహారాలనే అనేది.''

''ఎందుకని?''

''డబ్బున్నవాళ్లు, డబ్బుతో రక్షణ కొనుక్కోగల వాళ్లు... సృష్టించుకున్న ఆధునిక అగ్రహారాలుట. నాకు చికాకు వేసేది. ఎవరి రక్షణ వాళ్లు చూసుకోవటంలో తప్పేముంది? అని అడిగేవాడిని. తప్పుందని నేననలేదోయ్ సింహం అని నవ్వేది. మీ వదిన నీతో చాలా మాట్లాడేది గదా.''

''అవును అన్నీ అడిగేది. అంతా గ్రహించేది. బతికుండగా ఆ తల్లి దర్శనం చేసుకోలేకపోయాను. కృతఘ్నుణ్ని.''

''పద పోదాం,'' అన్నాడు హఠాత్తుగా శర్మ.

స్విమ్మింగ్‌పూల్ వద్ద ఇంకా ఆడవాళ్లు ఉండగానే, శర్మ అలా అనడంతో అచ్యుతం కాస్తంత ఆశ్చర్యంగా చూశాడు. అపార్ట్‌మెంట్ చేరేవరకూ శర్మ మాట్లాడలేదు. రాత్రి భోజనాల దగ్గర మీనా వడ్డిస్తోంది. దిగువ మెడ రవిక వేసుకుంది. తిండి బాగులేదన్న నెపం పెట్టి గట్టిగా తిట్టాడు శర్మ. నీకు ఎంత డబ్బు పోసినా కృతజ్ఞత లేదు అంటూ అరిచాడు. కళ్లలో నీళ్లు కుక్కుకుంటూ మీనా వెళ్లిపోయింది.

తిరిగి వడ్డనకి వచ్చేసరికి ఆమె బాగా ఏడ్చి ఉందని అచ్యుతం గ్రహించాడు. గ్రహించినా శర్మ గ్రహించనట్టు మాట్లాడలేదు.

"సారూ! మా ఏజెన్సీవాళ్లతో చెప్పేస్తాను. ఇక్కడ నేను పని చెయ్యలేను," అంది పెరుగు వడ్డిస్తూ.

"నీకు వేరే ఇల్లూ దొరుకుతుంది. నాకు వేరే మనిషీ దొరుకుతుంది. పోతే పో," అన్నాడు శర్మ. అతని గొంతు పూర్తిగా తగ్గిపోయి ఉంది.

ఆ రాత్రి శర్మ చాలాసేపు మాట్లాడలేదు. మధ్య మధ్యలో పొడిపొడిగా ఒకటీ రెండు మాటలు.

రెండు పెగ్గులు తీసుకున్నాక అన్నాడు-

"ఇదంతా నేను చేసుకున్నదే... దీనికి లోకువ ఇచ్చేశాను... నిజమే... పెళ్లాడతావా అని అడిగాను. నా వీక్నెస్ పట్టేసింది. అసలు నా నోట ఆరోజు ఆ మాట ఎందుకు వచ్చిందో... అసహ్యంగా ఉంది. నామీద నాకే అసహ్యంగా ఉంది. పెళ్లిట... పెళ్లాడి ఏం చేసుకుంటాను దాన్ని. అసలు నాకు యాస్మిన్ మీద ప్రేమ ఉందా... కనీసం కృతజ్ఞత ఉందా? ఉంటే, పని మనిషితో పెళ్లి ఏమిటి? ఎంత అసహ్యమైన మనిషిని? నా యాస్మిన్‌తో పాటు నేనెందుకు చావలేదు?..."

శర్మ మాటలు ఏడుపులోకి మారిపోయాయి.

నరసింహశర్మను అర్థం చేసుకోవటమే కాదు, ఓదార్చటం కూడా ఎలాగో అర్థం కావటంలేదు. చేతన యినట్టు ఊరుకో ఊరుకో అంటున్నాడు అచ్యుతం.

మూడో పెగ్గు పూర్తి చేసాక, తమ్ముడి చెయ్యి పట్టుకున్నాడు.

"అచ్యుతం, ఓ పని చేస్తావురా?"

"చెప్పు."

"ఇంతకాలం కలియనివాడివి... ఇప్పుడు కలిశావంటే నీకు డబ్బు ఎంత అవసరమో నాకు అర్థమవుతోంది. అన్ని అవసరాలూ తీరుస్తాను. ఇంటికి ఎంత పంపుతానంటే అంత ఇస్తాను. ఎంత డబ్బయినా సరే, పారేస్తాను. నాతో ఉండిపో. నన్ను చూసుకో," అన్నాడు.

*

"మీనా! మీనా!" గట్టిగా పిలిచాడు శర్మ.

"ఏంటి సార్," అంటూ వచ్చింది మీనా.

"అచ్యుతం ఏడీ?"

అచ్యుతం మంచం ఖాళీగా ఉంది. మీనా ఇల్లంతా తిరిగిచూసింది. అతని సామాన్లు లేవు. ఒక ఉత్తరం ఉంది.

శర్మ వణుకుతున్న చేతులతో ఉత్తరం తీసుకున్నాడు.

"అన్నయ్యా! అడగకుండా వచ్చాను. చెప్పకుండా వెళ్లిపోతున్నాను. నన్ను క్షమించు.

"మనిషి మనిషి దగ్గరకి వచ్చాడంటే కారణం డబ్బు. నిజమే, అందులో కొంత సత్యం ఉంది. ఆ సత్యం నిస్సిగ్గుగా ఒప్పుకోవడం తప్పు కాదు. కాని అది అందరి ముందూ ఒప్పుకోవడం సాధ్యం కాదు.

వదిన గొంతు, మాటలు తప్ప రూపం నాకు తెలియదు. నిన్ను కలిశాక ఆమె ఎంత ఉన్నతమయినదో అర్థమయింది. పనుల తొందరవల్ల నీ బదులు తను మాట్లాడుతున్నాననేది. తను మన కుటుంబానికి చేసే ప్రతి సాయమూ నీ ఆదేశానుసారం చేస్తున్నాననేది. నేనూ, నాన్నా, మన వాళ్లంతా నువ్వు సర్వోత్తముడివి అనుకునేట్టు చేసింది. అటువంటి సర్వోత్తముడిని కలుసుకోలేనందుకు మేమంతా బాధపడేట్టు చేసింది.

ఇటు మమ్మల్నీ అటు నిన్నూ ఒకరికొకరం మానసికంగా దగ్గరయేట్టు చేసింది. భౌతికంగా మనం కలుసుకోడానికి ఉన్న ఒకే ఒక అడ్డు అహం. ఎవరో ఒకరు ఒక్క అడుగు ముందుకు వెయ్యాలి. అది ఆత్మను శుద్ధి చేసుకుంటే తప్ప సాధ్యం కాదు. అది ఎవరికి వారు చేయవలసినది, సాధించవలసినది.

కాని, మనం దాన్ని సాధించలేకపోయాం.

ఇప్పుడు నేను వచ్చాను.

ఎలా? ఆత్మశుద్ధితో కాదు.

నీకు డబ్బెంత అవసరమో అర్థమవుతుంది, అన్నావు. నిజమే అది సత్యమే. కాని నేను ఒప్పుకోలేని సత్యం. వదిన నీ గురించి ఇచ్చిన చిత్రాన్ని నేను నీలో చూడగలిగితే... ఒప్పుకొనేవాడినేమో! మీనా కన్నా కాస్తంత ఎగువస్థాయిలో ఉండే పనివాడిగా నేను నీ దగ్గర ఉండాలి. ఏం? తోడబుట్టిన అన్నవు గదా, ఉండగూడదా? నా స్థానంలో వదిన ఉంటే తప్పకుండా ఉండగలిగేది. ఆమెవంటి స్థితప్రజ్ఞురాలు ఉండగలదు. నువ్వు ఇంగువ కట్టిన గుడ్డలా వదిన వాసన వేయగలవు గాని ఆ తల్లి చేయగలిగిన పని చేయలేవు. నువ్వే చేయలేనిది, వదిన నుంచి అందుకోలేకపోయినది... నా వల్ల అవుతుందా?

వదిన చేయగలిగినదీ... మనం చేయలేకపోయినదీ... మనిషి పట్ల సానుభూతితో కూడిన అవగాహన, ప్రేమ. మానవుడు దెబ్బతింటాడేమోగాని నాశనం కాడు అని వదిన అందన్నావు. దాని అసలు అర్థం నాకు

తెలియదుగాని... నాకు అర్థమయిందొక్కటే నాశనం లేని మనుషులు వదిన వంటివారని.

నేను నా అహాన్ని విడవగలిగితే... ఆత్మశుద్ధి చేసుకోగలిగితే... నువ్వెలాంటివాడివని గాని... మనలో ఒకరు యజమాని మరొకరు సేవకునిగా మార్చేది డబ్బు గాని... డబ్బు అయినా, అది నేను నీకు తోడుగా ఉండటానికి అసలు కారణం కాదని హృదయానికి పట్టించుకొని తిరిగి వస్తాను.

అన్నయ్యా! నాకు నీ అంత ఆలోచన లేదు. తెలివీ లేదు. అయినా ఒక్క ముక్క చెపుతాను.

వదిన చనిపోయాక నువ్వు కోల్పోయింది ఆమె సాహచర్యాన్నే కాదు... ఆమె దేహాన్ని కూడా. అవి లభించవన్నది వాస్తవం. ఒకదాన్ని అంగీకరించటానికి మన మనసు ఒప్పుకోదు. మనం మోసపోయినా నష్టం లేదుగాని... తోటి మనిషిని నమ్మకపోవడంలో నష్టం ఎక్కువేమో... మనని మనం ఒప్పుకోవడంలో కూడా నష్టం ఉందేమో!

ఏమైనా... అన్నయ్యా!

ఈ గేటెడ్ కమ్యూనిటీలు ఆధునిక అగ్రహారాలని వదిన అందన్నావు. డబ్బున్న వాళ్లు రక్షణకోసం వీటిని సృష్టించుకుంటే, ఒకప్పుడు జ్ఞానంగల వాళ్లమనుకొన్న వాళ్లు దానికి రక్షణ, పవిత్రత పేరుతో... అగ్రహారాలను సృష్టించుకొన్నారేమో! సంపద అందరికీ అందితే ఈనాడూ... జ్ఞానం అందరికీ అందితే ఆనాడూ... ఈ రక్షణలు అవసరం వుండేవి కావేమో!

ఏమైనా, మనిషి తన మనసునే ఒక అగ్రహారమో, గేటెడ్ కమ్యూనిటీ చేసుకొన్నాడేమో! మనసుకి అహం, అగ్రహారాలకు వర్ణవ్యవస్థ, గేటెడ్ కమ్యూనిటీలకు డబ్బు కట్టిన గోడలు... మనిషిని మనిషి నుండి రక్షిస్తున్నాయన్న భ్రమలో... దూరం చేస్తున్నాయేమో!

నన్ను క్షమించు... తమ్ముడు అనంతం.”

నరసింహశర్మ కళ్లలో నీళ్లు నిండాయి. అతనికి ఏడుపు ఆపుకోబోతుంటే వెక్కు వస్తోంది. వణుకు వస్తోంది. మీనా ఆపుకోలేకపోయింది. దగ్గరగా వచ్చి గుండెలకి అదిమి పట్టుకుంది.

*అరుణతార, నవంబర్ 2008*

